# లేటొచ్చిన బస్సు

వినయ్



మొన్నటి ఎన్నికల సమయంలో చిక్కమగళూరు పోలింగ్ బూత్‌లా వుంది బస్సుస్టాపు. ఆఫీసులకు వెళ్ళవలసినవాళ్ళు, కాలేజీకి వెళ్ళవలసినవాళ్ళు—చిన్నా పెద్దా, ఆడా మగా కలిసి చూడ్డానికి పెళ్ళిగుంపులా కనిపిస్తున్నారు. వచ్చి యెదుర్కోవలసిన ఆడ పెళ్ళివారు ముహూర్త సమయం దాటిపోతున్నా జాడలేనట్టు విసుగుపడుతున్నారు,రావలసిన బస్సుకోసం చూస్తూ. ఆ బస్సు మరో అరగంటదాకా రాకూడదని తమ తమ దేవుళ్ళకు, ఆరాధ్య బాబాలకు మొక్కుకుంటున్నారు రిక్షావాళ్ళు, ఒక్క సవారీయైనా దొరుకుతుందనీ, ఒక్కపూటైనా పొయ్యిలో పిల్లి లేస్తుందనీ. బలమైన అధికార పార్టీని యెదిరించలేక, ఊరుకోలేక చెలరేగే ప్రతిపక్ష నాయకుడి అసహనంలాగా ఎండ మండిపోతూంది.

బేరాలాడుతున్న రిక్షావాళ్ళని చూసి, వాళ్ళ అఘాయిత్యాలను దుమ్మెత్తిపోస్తున్నాడు ఓ సూటువాలా. బస్సుల రాకలో లేని పంక్చ్యుయాలిటీని విమర్శిస్తున్నాడో ఇన్‌షర్ట్‌వాలా. అప్పటిదాకా మౌనంగా నిల్చున్న ఓ పెద్దమనిషి మలయాళంవాళ్ళు లిఫ్టు యిచ్చాక తెలుగు నటీమణిని తనూ బుక్ చేసుకునే పదహారణాల తెలుగు నిర్మాతలా—అప్పుడు మొదలుపెట్టాడు, ఆ బస్సు సమయానికి రాకపోవడం వలన తనకు కలిగే నష్టాల లిస్టుని. బస్ కండక్టర్లు, ఆ మాటకొస్తే బస్సు డిపో వాళ్ళూ డ్రైవర్లుల్ని ఎక్కడెక్కడ ఎలా అవమానించిందీ ఏకరువు పెడుతోన్నాడో స్టూడెంటు. నీటి వనరుల గురించి ప్రభుత్వం ఎండాకాలంలో చేసే వాగ్దానాలు ఎండలు పోయేసరికి మరిచిపోయినట్టే, బస్సెక్కి దిగేసరికి వాళ్ళు అవన్నీ మరచిపోతారు. మళ్ళీ బస్సుకోసం పడిగాపులు గాసేటప్పుడు గుర్తొస్తుంది, మరునాడు మరొకరితో చర్చ, మళ్ళీ....ఎప్పుడూ భూమి గుండ్రముగా ఉండును.

ఆ జనంలోనే వున్న కేశవ్, బస్సు రాక ప్రాబబిలిటీని అంచనావేస్తూ తీవ్రంగా చర్చించుకుంటున్నాడు. వాళ్ళ కాలేజీ పేరేమిటోగానీ, అది సరిగ్గా దుర్గా కళామందిర్ (సెవెంటీ ఎమ్మెమ్) ఎదురుగా వుంది. అతను కాలేజీ స్టూడెంట్. అంటే ఆరోజు రిలీజయిన సినిమా ఏదీలేని రోజున కాలేజీ బాగోగులు విచారించటం మొదటి పీరియడ్ కాలేజీ పక్కనున్న కపాలీ బేకరీ రెస్టారెంట్‌లో లేటెస్టు రికార్డులు వింటూ, తలాడిస్తూ, ఇరానీ టీ తాగటం, వినే క్లాసుల్లో మాస్టర్లు చేసిన లెక్చరర్లకుకూడా ఆ యా సబ్జక్టుల్లో అంతుపట్టని తెలివైన ప్రశ్నలడగటం, వగైరా కారుడు. ఎంటీయార్ డ్రెస్సులు కుట్టించి టైలర్లకు, కమలహాసన్ హెయిర్ సెల్, మీసాల అలంకరణలతో హెయిర్ డ్రెస్సర్లకు ఇతోధిక సేవచేస్తూ, రజనీకాంత్ స్టైల్స్ అనుకరిస్తూ, అమ్మాయి వెంట సినిమాలో డ్యూయెట్‌లా ఉండకపోతే ఆ లైఫ్ నిస్సారంగా, జయమాలిని లేని తెలుగు సినిమాలా వుంటుందని అతని అభిప్రాయం. ఇలా 'కాలేజ్ స్టూడెంటు'గా అతనిగురించి యెంతైనా రాయొచ్చు. అందునా, రాస్తున్నంతలో బస్సు వస్తుందనీ, అతను వెళ్ళిపోతాడనే భయమేమీ లేదు. మన దేశంలో అరగంట లేటొచ్చే రైళ్ళుంటే, గంట లేటొచ్చే సిటీ బస్సులు ఉండనే ఉంటాయి, రైళ్ళ పురోగతి రికార్డులు బద్దలు చేస్తూ. కానీ మరింత రాయటంవల్ల, ఇలా వుండని బుద్ధి తక్కువ కాలేజీ స్టూడెంటు యెవరైనా మన మీద పరువునష్టం దావా వేయొచ్చు. ఆనక మనం కోర్టు పక్షులం కావొచ్చు.

ఇక అసలు సంగతి. ఆ రోజే రెండు సినిమాలు రిలీజైనాయి. వినోదమహల్లో 'దొంగల వేట', నర్తకిలో 'యుగపురుషుడు'—ఆ రెండూ ఆ రోజునే విడుదలవుతున్నాయి. దేనికి వెళ్ళటం? ఇంకో పావుగంటకు బస్సు వచ్చినా, మరో పావుగంటలో థియేటర్లో ఉండొచ్చు. జేబులో ఒకే ఒక్క రూపాయి వుంది. బస్సుకు ఇరవై అయిదుపైసలు పోను, ముప్పావలా సినిమా టిక్కెట్ కుంటుంది. ఆ రోజు పద్మాలుగో తేదీ గనుక ఇంటినుండి వచ్చే రెండో మనియార్డర్ మరో మూడురోజులదాకా రాదు. ఎవణ్ణయినా చేబదులు అడిగినా ప్రయోజనం వుండదు. ఐతే, ఇప్పుడు ఏ సినిమా చూడటం? బస్సు వస్తే బాగుణ్ణనుకున్నాడు.

"టైమెంతయిం దండీ?" అడిగాడు, పక్కతన్ని.

"పావు తక్కువ పది."

"పావుగంటలో బస్సు వస్తే బాగుణ్ను" అనుకున్నాడు, ఈ సంబంధమైనా కుదిరితే బావుణ్నని పద్నాలుగోసారి కూచున్న ఆడ

## రచయిత గురించి

రచయితగా నన్ను పరిచయం చేసుకోమన్నది 'జ్యోతి'. ప్రస్తుతం రచయితలంతా పరిచయం చేసుకుంటే తప్ప 'ప్రస్తుతం లేని' వాళ్ళు, ఓటర్ల లిస్టులో తప్ప పేరులేని వాళ్ళు. చదువుకున్నాను. రాయటం వచ్చు గనుక రాస్తున్నాను. రాయటంలోనే బతకాలనుకున్నాను గానీ రాయటంతో బతుకుతాననుకోలేదు (గుమస్తా ఉద్యోగం). అర్థంకానిది గొప్ప సాహిత్య మనుకుంటారు చాలామంది. చాలామంది ఎడిటర్ల దృష్టిలో నేను గొప్ప రచయితగా నిలిచిపోతున్నాను.

ఓ పత్రికను విమర్శిస్తే చాలు, మళ్ళీ ఆ పత్రికలో తన పేరు చూడ నోచుకోడు ఏ రచయితా, వాళ్ల తనను తిట్టే సందర్భాలలో తప్ప. ఇలాంటి వ్యవస్థలో ఒక రచయితకు ప్రత్యేక పరిచయం ఏముంటుంది? 'జ్యోతి'కి కృతజ్ఞతలు.

—వినయ్

పిల్లలా.

తోటి గుమస్తా గిరితో మాట్లాడుతున్నాడు గౌరీశం. అతనిలో ఏదో బాధ కనిపిస్తూంది. స్వేచ్ఛగా బ్రతుకలేని మన సత్వపు జాడ, ఆత్మీయుల్ని బాధలో వదలి వస్తూన్న ఆందోళన సీలినీడ గోచరిస్తున్నాయి. వాళ్ళిద్దరూ పోస్టాఫీసులో క్లర్కులు. అంటే యముని కార్యాలయంలో దూతలు.అథవా,ఆ యముడు, జరగాల్సిన పని సక్రమంగా జరిగే ఏర్పాటు లేకుండానే ఎవరికైనా లీవు సాంక్షన్ చేస్తాడేయో కానీ, న్యూమోనియా పేషెంట్ వర్షంలో తడిసొచ్చి, సెలవు చీటీ అందించబోయినా, మరో మనిషి ఆ పని చేసే ఏర్పాటు లేకుండా అతణ్ని వెళ్ళనీయరు.

అందుకే, తొలిచూలు భార్యను వదలి ఉండలేకున్నా వారం రోజులు ఆఫీసులో గడిపాడు. ఆ రోజు ప్రసవం వస్తుందని డాక్టర్ చెప్పింది. తాను హాస్పిటల్‌లో జాయిన్ చేయించలేడు. కనీసం యింటిదగ్గర భార్యకు తోడుగా ఉండటానికి ఆ రోజుకూడా వీలులేదు.

"లీవు ముందుగా అడిగితే బావుండేదోయ్...." ఉచిత సలహా వొకటి పారేశాడు గిరి.

"అది వారం రోజుల క్రితమే అయింది. నిన్న కూడా ఎంతగా చెప్పినా ఆ యముడి గుండె కరగలేదురా. వాడూ కన్నాడు పిల్లల్ని" కసిగా అన్నాడు గౌరీశం, తన నిస్సహాయతను దాచుకోలేక.

"వాడి పెళ్ళాం పిల్లల్ని కనేటప్పుడు ముందో నెల, తరువాతో నెలా నర్సింగ్ హోమ్‌లో ఉంటుందోయ్. వాడు మంచి చెడ్డలు కనుక్కోవలసిన అవసరం కూడా వుండదు" —విలువ పడిపోయింది గనుకే నిజాన్ని అంత ఈజీగా వదిలేశాడు గిరి.

గిరికి కూడా తీరికుండదు. లేకుంటే ఎలాగో తన పని అప్పగించి, హాఫ్‌డేకోసమైనా వచ్చేవాడు. ఇప్పుడు తొందరగా వెళ్ళి, ఎవర్నయినా ఒప్పించి యెలాగయినా రావాలి. ముందు ఈ





బస్సు రావాలి. అప్పటికి పదోసారి పది కావటానికి ఎంత టైముందో చూసుకోవటం.

"వెధవ బస్సు. ఒక్కనాడూ టైముకు వచ్చి చావదు. ముప్పయ్యేళ్ళనించీ చూస్తున్నా" సణుక్కుంటున్నాడు యాభయ్యేళ్ళకు దగ్గర పడిన పరంధామయ్య.

అతను పని చేసేది ప్రైవేట్ కంపెనీలో. ఇరవైయేళ్ళుగా పని చేస్తున్నా, బస్సు ప్రయాణం కాదనుకుని రిక్షాలో ఆఫీసుకు వెళ్ళలేకపోయాడు. బస్సే లేటైనప్పుడల్లా, పరంధామయ్య ఆఫీసులో చేరినప్పటికింకా పుట్టని ప్రస్తుత యజమాని చీవాట్లు పెట్టినా, ఎద్దులాగా కంప్యూటర్‌లాగా పని చేస్తాడని, చీవాట్లు మించి ఏమీ చెయ్యడు.

బస్సు కోసం కూర్చున్నప్పటి నుండీ, బస్సెక్కేదాకా బస్సువాళ్ళని తిట్టుకుంటూనే వుంటాడు. మొదట్లో ఓసారి కంప్లెయింట్ రాశాడు. ఆ మర్నాటినుండీ తను స్టాపులో కనిపిస్తే ఆమడ దూరంలో ఆపేవాడు కండక్టర్. అంతకు మించి మార్పేమీ రాలేదు. ఆ తరువాత లెటర్స్ కాలమ్‌లో ఉత్తరం రాశాడు. మరునాడు, పరంధామయ్య పెద్ద బాస్, ఆయన్ని పిలిచి "నువ్వు కమ్యూనిస్టువా?" అంటూ అరగంటసేపు నీతి బోధలు చేశాడు. బస్సు మాత్రం ఎప్పుడూ టైంకొచ్చిన పాపాన పోలేదు. ఇంట్లోనూ, బైటా—ఎప్పుడూ బస్సు వాళ్ళమీద తన ప్రతీకారం తీర్చుకోవడమెలాగా అని ఆలోచిస్తూంటాడు. ఒక సిగరెట్ తీసి వెలిగించుకున్నాడు.

బస్సు మాట యెలా వున్నా ఇందిరాగాంధీ గురించీ, ఇంటర్‌నేషనల్ సమస్యల గురించీ, యూనివర్సిటీల పేర్ల గురించీ తీవ్రంగా చర్చలు జరుగుతున్నాయి. కాలం మరో పది నిమిషాలను మింగేసింది. ఎం.పీ.ల లాగా, ఎమ్మెల్లేల లాగా గడియారాల ముళ్ళు క్షణక్షణం స్థానం మారుతున్నాయే కానీ సమస్యలు మారటం లేదు. కాలం మారుతూందే గానీ మనుషులు మారటంలేదు. ఎక్కవలసిన బస్సు వస్తుందన్న ఆశ లేకున్నా, రిక్షావాడికి ఐదుపైసలు ఎక్కువివ్వటానికి చస్తూ, వాదులాడుతున్నా రిద్దరు మహానుభావులు.

బస్సు వస్తే బాగుణ్ను. ఎంతైనా 'యుగపురుషుడు' సినిమాస్కోప్. పైగా రామారావ్ కరాటే ఫైటింగ్ చేస్తాట్ట. ఎలా వుంటుందో? బస్సుకు పావలా పోను, ముప్పావలా వుంటుంది. 'దొంగలవేట'కైనా సరిపోతుంది. రెండు థియేటర్లూ పక్క పక్కనే. 'దొంగలవేట' వదిలేయవలసిన సినిమా యేమీ కాదు. కృష్ణ క్రైం అంటే మాటలా? అందునా కెయస్సార్ దాస్ దర్శకత్వం. కేశవ్ మనసు రెపరెపలాడుతూంది. కదిలి వెళ్ళ బుద్ధికావటం లేదు. దేనికి వెళ్ళాలో అర్థం కావటం లేదు. నడిచివెళ్ళినా యిప్పటికి వెళ్ళేవాడే. కానీ, తీరా యిప్పుడు నడిస్తే చేరుకోగలడా? నాలుగు అడుగులు వేయగానే బస్సు వస్తే....?

బస్సు వస్తే బాగుండేది? పోస్టాఫీస్‌కు వెళ్ళేది అదొక్కటే బస్సు. గిరి రిక్షావాణ్ని పిలుస్తున్నాడు. తనదగర రిక్షాకుకూడా డబ్బులు లేవు. పోనీ వెళ్ళకపోతే....? అమ్మో, ఇంకేమైనా వుందా? అసలే పోస్టాఫీస్. అందునా ఇది తపాలా వారోత్సవం జరుగుతున్న రోజు. వెళ్ళకపోతే పెద్ద రిమార్కు. ఓ రోజు జీతం రాదు. సస్పెండ్ చేసినా చేస్తారు. ఇందిరాగాంధీ మీద షా కమీషన్ ఎంక్వైరీలాగా, అసలే భార్య గర్భవతి. ఖర్చు యెక్కువయ్యే రోజులు. ఒకవేళ బస్సు యింకో పావుగంట వరకూ రాకపోతే....?

"వెధవ ముండాబస్సు.ఇదేదో టైంకొస్తుందని రోజూ తొమ్మిదింబావుకొచ్చి కూచోవటం తనబుద్ధి తక్కువ" సిగరుట్టు పీక కసిగా నలిపేస్తూ అనుకున్నాడు పరంధామయ్య. అసలీ బస్సు డిపో వెధవల కిదేం రోగం? తొమ్మిదింబావుకొస్తాదన్న బస్సు యెందుకు రాదు? పోనీ, దాని టైం ఎనిమిదిన్నరకి మార్చి, తొమ్మిదింబావుకి పంపినా బావుండేది కదా! ఓసారి డిపో మేనేజర్‌గాణ్ని తీసుకొచ్చి, తొమ్మిదింబావుకి యిక్కడ నిలబెటాలి. వెధవకి, అప్పుడు కానీ బుద్ధిరాదు. కాలేజీకి వెళ్ళే పిల్లలు, ఆడవాళ్ళు, తనలాంటి ముసిలాళ్ళూ ఎందరెందరు, కుక్కల్లా పడిగాపులు గాస్తూ, ఎంత విసుగు

పడతారో తెలిసొస్తుంది. కాని వాడికేం ఖర్మ. వాడు బస్సుకోసం యెందుకు నిలబడతాడు? కాకపోతే, ఎమ్మెల్లే సీటుకోసం నిలబడతాడు. టూరిజం డిపార్ట్మెంట్ మంత్రి వెధవని ఓ సారి బస్సులో ప్రయాణం చేయమనాలి. బుర్ర పగిలిపోతె, గుడ్డలు నలిగిపోతే, పెట్టుకున్న టోపీ యెగిరిపోతే, బస్సు కుదుపులకి ఒళ్ళు హూనమైతే—అప్పుడు తెలుస్తుంది వాడికి, బస్సుల్ని యెలా నడపాలో—కసిగా అనుకుంటున్నాడు పరంధామయ్య.

ఎవరి సమస్య వాళ్ళది. ఎవరి ఆలోచనలు వాళ్ళవి. కానీ అవన్నీ సూర్యుడి చుట్టూ గ్రహాల్లాగా బస్సు రావటాన్ని కేంద్రం చేసుకుని పరిభ్రమిస్తున్నాయి. "బస్సు వస్తే బాగుణ్ను"—ప్రతివారి మనసులోనూ అదే మాట. ఇంతలోకే బస్సు చప్పుడు వినిపించింది. బస్సుస్టాపు సరిగ్గా మలుపులో వుంది. అందుకే కనిపించకుండా వినిపించిన శబ్దం లారీదేమోనని ఒకాయన సందేహం వెలిబుచ్చాడు.

"కాదు, అది బస్సే—" అన్నాడు కేశవ్, తన కాలేజీ ప్రయాణంలో బస్సు శబ్దాన్ని గుర్తించగలిగిన సామర్థ్యాన్ని తెలియచెప్పుకుంటూ.

ఒక్కక్షణం అందరి మొహాల్లోనూ వెలుగు కనిపించింది.

ఇందిరాగాంధీ మళ్ళీ గెలిచిందని విన్న కాంగ్రెస్—ఐ వాళ్ళలాగా, ఇందిరాగాంధీని పార్లమెంట్నించి బహిష్కరించారని విన్న జనతావాళ్ళలాగా, చరణ్సింగ్ ఉప ప్రధాని కాబోతున్నాడని తెలిసిన రాజనారాయణ్లాగా అందరూ మొహాల్లో సంతోషాన్ని ప్రకటించారు.

"అమ్మయ్య. సినిమాకు వెడుతున్నాను. ఏ సినిమాకు వెళ్ళాలో అక్కడ నిర్ణయించుకోవచ్చులే" అనుకున్నాడు కేశవ్.

"గిరి అనవసరంగా రిక్షాకు డబ్బులు ఖర్చు పెట్టాడు. అతనెట్లా పోయినా నేను ఆఫీస్కు పోతున్నాను. కానీ అక్కడ జానకి యెలా వుందో, ఏమవుతుందో"—అని మనసు క్షోభిస్తున్నా, అప్పటిదాకా వున్న ధోలాయమాన పరిస్థితిని ఆ వస్తున్న బస్సు దూరం చేసింది. ఇక ఆఫీసుకు వెళ్ళక తప్పదనే నిర్ణయాన్ని చేసి, పార్లమెంట్ శాసనాల్ని ప్రజల నెత్తిన రుద్దినట్టు రుద్దింది.

"పాడు బస్సు. ఇప్పటికైనా వస్తూంది. రాక యెక్కడికి పోతుందిలే. ఆ వచ్చేదేదో టైంకు వస్తే దాని కండక్టర్ సొమ్మేం పోయిందో? పదయ్యింది. కంపెనీకి వెళ్ళగానే, ఆ కుర్రకుంక యింత ముసిలాణ్నన్నే గౌరవం ఏమాత్రమూ లేకుండా దులిపేస్తాడు. బస్సులున్నంత కాలం తనకు చీవాట్లు తప్పవు. చూపున్నా లేకున్నా కళ్ళున్నంతకాలం కన్నీళ్ళు తప్పనట్టు" అనుకున్నాడు పరంధామయ్య.

రోహిణీ కార్తెలోని నీళ్ళులేని మబ్బులాగా జనతా వాళ్ళ మొదటి బడ్జెట్లాగా, ఉద్యోగం రాని ఇంటర్వ్యూకాల్లాగా ఆశ రేపి, చల్లార్చి వెళ్ళింది 'డిస్ట్రిక్టు బస్సు'. డెబ్బయ్యేడు మార్చి ఎలక్షన్ల తరువాత కాంగ్రెస్వాళ్ళ ముఖాల్లాగా అయినాయి అందరి ముఖాలూనూ. కొందరి మొహాలు మాత్రం 'రాజ్యసభుందిగా' అనే ధీమా ఉన్నట్టుగా కనిపిస్తున్నాయి.


కేశవ్ విసుక్కుంటున్నాడు. గౌరీశం ఆతురత పడుతున్నాడు. ఆ సిపాస్తులన్నీ తాకట్టు పెట్టి తీసిన సినిమాను సెన్సారు చేయరటని తెలిసిన నిర్మాతలా వున్నాడు పరంధామయ్య, మండిపోతూ.

"ఇకనైనా బస్సువస్తే సినిమా చూడొచ్చు" అనుకున్నాడు కేశవ్. తన జన్మలో ఇంత వరకూ మొదటిరోజు సినిమా చూడకుండా వుండలేదు. అలాంటిది, యివాళ తప్పేటట్టే వుంది సినిమా. ఛ. ఛీ, వెధవ బస్సులు. పోనీ, ఈ పడిగాపులు పడేకంటే కాలేజీకే వెళ్ళితే పోలా. మనియార్డర్ రొచ్చాక హాయిగా చూడొచ్చు! అమ్మో! ఎలా చేయగలను, చూస్తూ చూస్తూ—అనుకున్నాడు, విసుగుపడుతూనే.

బస్సింకో ఐదు నిమిషాల కొచ్చినా ఎలా








గోలా సర్దుకోవచ్చు—అనుకున్నాడు గౌరీశం. అతని మనసు మళ్ళీ భార్యవైపు తిరిగింది. అసలే తొలిచూలు. అందునా జానకి వట్టి నీరసం మనిషి. ఎటొచ్చీ ఏమవుతుందో చెప్పలేం. పక్కింటావిణ్ని కనిపెట్టుకుని ఉండమని చెప్పేవచ్చాడు. ఐనా మనసు ఆరాటపడిపోతూనేవుంది. పెళ్ళయినప్పట్నించీ ఏ సరదాలూ లేకపోయినా, కడుపుతోవున్నప్పుడైనా ఏ కోరికలూ తీర్చలేకపోయినా, కనేటప్పుడు భర్త పక్కనుండాలని కోరుకుంటుంది ఆడది. అంత చిన్న కోరిక కూడా తీర్చలేని బ్రతుకయింది తనది. ఉత్తరాలు రాసినంత మాత్రాన దూరాభారం అని పెద్దవాళ్ళు, కావలసినవాళ్ళలో యేవళ్ళూ రాలేదు. తను హాస్పిటల్లో చేర్పించి ఆ ఖర్చు భరించలేడు. సరే, అటు జానకి యిలా వున్నా, ఇటు ఆఫీసుకూ టైంకు చేరుకునేట్టు లేదు—బాధగా అనుకున్నాడు.

"మరీ ముసలాణ్ని, గుమస్తానూ అయి పోయానుగానీ నేనే మంచి వయసులో వుంటే కండక్టర్ వెధవల్ని బావ చితక తన్నేసేవాణ్ణి. యే పోలీస్ డిపార్ట్మెంట్ ఉద్యోగినో ఐనా, ఆ మధ్య బస్సులవాళ్ళకీ, పోలీసువాళ్ళకీ జరిగిన గొడవలాంటి దొకటి సృష్టించేవాణ్ని. వెధవది, యెటూ కాకుండా పోయింది. బతికిపోతున్నారు బస్సుడిపో నా"కొడుకులు" మండిపడుతున్నాడు పరంధామయ్య లోలోపల. అతనికి బస్సులమీద చాలా కసిగా వుంది. కానీ అది తీర్చుకోవటానికి ఒక్క మార్గమూ కనిపించటం లేదు.

లోలకం అటూ ఇటూ వూగినట్టు వుంది వాళ్ళ పరిస్థితీ, మనస్థితీ. అసలు ఈ జీవితాలే కష్టసుఖాల మధ్య ఊగిసలాడుతున్నాయి. "కలిమిలేములు, కష్ట సుఖాలూ — కావడిలో కుండలనీ భయమేలోయీ" అన్నాడు సముద్రాల. కానీ చాలామంది కష్టాల కడలిలో కెరటాలలాంటివాళ్ళు. సుఖాల జాబిలిని అందుకోను ఊహాల శూన్యంలోకి ఎగిసి, ఎగిసి పడుతూ ఆ కడలిలోనే కలసిపోతారు. అంతా జీవితమనే బస్సుస్టాపులో అవకాశపు బస్సుకోసం యెదురుచూస్తున్నవారే. అది ఆశలను పండించకపోయినా కనీసం అవసరాలు తీరిస్తే చాలు. అంతేకానీ, పోట్లాటంతా ఐపోయాక వచ్చే సినిమా పోలీసులను అనుసరిస్తే నిష్ప్రయోజనం.

సినిమా టైం దగ్గరపడుతున్నా కేశవ్ ఇంకా బస్సుకోసమే ఎదురుచూస్తున్నాడు కానీ కాలేజీకైనా వెడదామని అనుకోలేకపోతున్నాడు. ఆ

బస్సు వచ్చినా వెళ్ళేసరికి సరిగ్గా సినిమా స్టార్టవుతుంది. బుకింగ్ అప్పటికే అయిపోతుంది. కాకున్నా టిక్కెట్ దొరకడానికి మరో జన్మ యెత్తాలి. కానీ అదంతా ఆలోచనా పరిధిలోకి రానీయడు. ఒక రకం ఆలోచనకు అలవాటుపడిపోయాడు. అంతే.

గౌరీశంకి ఆఫీస్ టైమవుతుంది. బస్సు వెంటనే వచ్చినా, ఆఫీసుకు లేటవక తప్పదు. రిమార్కు తప్పదు. తనకు లీవులున్నాయి. చచ్చేంత అవసరమున్నప్పుడైనా, ఎందుకివ్వరని అడిగే ధైర్యం లేదు. లీవు ఇవ్వకపోతే పోనీ, భార్యను చావుబతుకుల సమయంలో దగ్గరుండి చూసుకునే 'అదృష్టం' లేదని ఏడుస్తాడే తప్ప, జరిగిందేదో జరిగిందని, జరుగుతున్నదాన్నైనా సమగ్రంగా ఆలోచించే శక్తి లేదు "బస్సు యింకో గంటదాకా రాకపోయినా వేచి చూస్తూ నిలబడదాం ఓపిగ్గా" అనుకున్నాడు చిరాగ్గా.

"ఈ వెధవ బస్సుల్నీ, బస్సు వెధవలనీ యేమీ చేయలేకపోతున్నాను. ఇక చేయలేను. అసలు యీ దేశంలో బస్సులో తప్ప వెళ్ళలేని దౌర్భాగ్యపు వర్గంలో పుట్టటం నా తప్పు" అనుకున్నాడు, నీరసంగా.

బస్సు రాకుండా పోదు. వస్తుంది, ఎప్పటికో ఒకప్పటికి. అది ఆలస్యంగా రావటానికి సవాలక్ష కారణాలుంటాయి. బస్సులు నడిపించి చూస్తే తెలిసొస్తుంది యెవళ్ళకైనా! ఎప్పుడో ఒకప్పుడు, ఏదో ఒకలాగా బస్సొచ్చిన తరువాత బుద్ధభగవానుడి నేలలో పుట్టిన మనం, యెలా వాణ్ని తప్పని తన్నగలం. వెళ్ళాల్సిన చోటుకి చేరుస్తూ, రిక్షావాళ్ళకంటే తక్కువే డబ్బు తీసుకుంటుందన్న సత్యాన్ని ఎలా కాదనగలం? "సత్యమేవ జయతి" మన సూత్రం కాదా. మన జెండాపై ధర్మచక్రం వేసుకుని, గుండాల్లాగా అన్యాయంగా బస్సుల్ని యెలా నమ్మెత్తి పోస్తాం?—అందరూ అదే అనుకుంటారు.

కళ్ళల్లో వత్తులు వేసుకుని చూస్తున్న వాళ్ళకు, బస్సు శబ్దం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాటలాగా తీయగా వినిపించటం లేదు. శాస్త్రీయ రాగంలాగా యేం రాగమోనని భయపడి చస్తున్నారు. అదీ ఇంతకుముందు బస్సులాగే, ప్రేమిస్తున్న అమ్మాయికి పెళ్ళయిందనే వార్తలా చేస్తుందేమో నని సందేహిస్తున్నారు.

ఇంతలోకే అందరికీ కావలసిన బస్సు, అదే నెంబరు బస్సు, మలుపు తిరుగుతూ, అందరి ఆలోచనల్నీ మలుపు తిప్పింది. అందరి మనసుల్లోనూ ఉత్సాహం పొంగి పొరలింది. బస్సు వస్తోంది. మనసులన్నీ ఒక నిర్ణయానికి వస్తున్నాయి.

"అమ్మయ్య. సినిమా చూడబోతున్నాను" పొంగిపోయాడు కేశవ్.

"ఎలాగోలా ఆఫీస్ కెడుతున్నాను" నిట్టూర్చాడు గౌరీశం.

స్టాపుకు పదిగజాల దూరంలో చెట్టుకింద కూచున్న పరంధామయ్య, "వెధవ ముండా బస్సు. రాక యెక్కడికి పోతుందిలే—" అని సణుక్కుంటూ లేవటానికి ఉపక్రమించాడు.

వస్తూన్న బస్సు వచ్చేసింది. స్టాపు దగ్గిరకొచ్చింది. కానీ, చిన్న స్టేషన్‌లో ఆగని సూపర్ ఫాస్ట్ ట్రెయిన్‌లాగా సర్రున వెళ్ళిపోయింది.

నిరాశగా కాలేజీవైపు అడుగులేస్తున్నాడు కేశవ్.

నిస్పృహతో యింటిముఖం పట్టిన గౌరీశం ఒకింత సంతోషిస్తున్నాడు.

స్టాపు దాటి దూసుకొస్తున్న బస్సుని చూసి పరంధామయ్యకి ఒళ్ళు మండిపోయింది. పక్కనే కనిపించిన కంకరరాయి తీసుకుని తనను దాటిపోతున్న బస్సుమీదికి కసికొద్దీ విసిరాడు. బస్సు అద్దం ఫెళఫెళ విరిగింది. క్షణంపాటు ఆగింది బస్సు. ముసలాయన రాయి విసురుతాడని ఎవరనుకుంటారు? పరంధామయ్య వీరుడిలాగా బస్సెక్కాడు. మరుక్షణం రయ్యిన సాగిపోయింది బస్సు.

ఎంత నిజం. ఆలోచన చేయించలేనిది, ఒక్కోసారి అవసరం చేయిస్తుంది. ఇప్పుడు లేటొచ్చిన బస్సు ఆ ముగురితో చేయించింది. అది పచ్చి నిజమని కాలేజీకి వెడుతున్న కేశవ్ చెప్పటంలేదు. "పోతే పోనీ ఆఫీసని" యింటికెళుతున్న గౌరీశం చెప్పలేదు. చెప్పనక్కర్లేదు. ఐనా, ఆ పగిలిన అద్దపుముక్కలు చెపుతున్నట్టనిపిస్తోంది. □

# కొంటె బొమ్మల బాపు

వ్యంగ్యచిత్ర రచన 30,000 సంవత్సరాల క్రితం ప్రారంభమైంది. ఆనాటి మానవుడు రాళ్ళమీద, తను నివసించిన గుహల గోడల మీద "పిచ్చి గీతలు" గీసి కడుపార నవ్వుకున్నాడు. క్రీ.పూ. 1000 సంవత్సరాల క్రితం ఈజిప్షియన్లు "పాపిరస్" మీద వ్యంగ్య చిత్రాలు గీశారు. క్రీ.పూ. 500సంవత్సరాల క్రితం రోమనులు మట్టిపాత్రలమీద వ్యంగ్యచిత్ర కథలు చిత్రించారు. ఈ విధంగా ప్రారంభమైన ఈ కళ యిప్పుడు, ఇరవైయవ శతాబ్దంలో తారాస్థాయి నందుకుంది. ఈలోగా HONORE DAUMIER, GEORGE CRUICK-SHANK, SIR JOHN TENNIEL లాంటి గొప్ప వ్యంగ్య చిత్రకారులు పుట్టి యీ కళకు జీవం పోశారు. ఈనాడు, తెలుగు పత్రికాలోకానికి వ్యంగ్యచిత్ర రచన ప్రాముఖ్యతని చాటి తద్వారా నూతన హాస్య యుగానికి శంఖాన్ని పూరించిన వైతాళికుడు శ్రీ బాపు. ప్రపంచ కార్టూనిస్టులలో, బాపుకు సమ వుజ్జీలుగ JOHNNY HART, JACK MARKOW, LICHTY, BOB DUNN, IRVING PHILLIPS, JERRY ROBINSON, TED KEY ల పేర్లను చెప్పుకోవచ్చు. వీళ్ళ కార్టూనులలో కొన్ని విశిష్టతలు కనిపించినా, బాపు బొమ్మల్లోని ప్రత్యేకమైన వైవిధ్యం, విశ్లేషణ కనబడవు. బాపు గొప్ప ANALYST! అందు చేత వీళ్ళందరిలోనూ బాపూదే ప్రథమస్థానం. బాపూ బొమ్మ అందానికి ప్రతిరూపం. భావాలకి దర్పణం. బాపు ఒకవైపు ILLUSTRATIO-NIST గానూ, మరోవైపు CARTOONIST గానూ వ్యవహరిస్తున్న గీతాసార మెరిగిన "సవ్యసాచి".

మనిషి ముఖంలోని కండరాలు సుమారు నలభై రకాల భావాలని వ్యక్తపరచగలవని DESMOND MORRIS పేర్కొన్నాడు. బాపు ఆ నలభై రకాల భావాలని తన బొమ్మల్లో ప్రతిబింబించగల ప్రతిభాశాలి. కార్టూన్ల కోసం బాపూ స్పృశించని అంశమే లేదు. ఆయన మస్తిష్కంలో ఒక పెద్ద పరిశోధనాలయం వుంది. దానికి అండగా ఆయనవద్ద ఒక చక్కటి లైబ్రరీ వుంది. అన్నిటికి మించి మంచి చదువుంది. పరిశీలనుంది.

నవోదయవారు బాపూ వేసిన కార్టూన్లలో చాల తక్కువవాటినే ప్రచురించారు. బాపూ కార్టూన్లలో మంచివాటిని ఏరడం సులభసాధ్యం కాదు. ఆయనవన్నీ మంచి కార్టూనులే. అందుచేత ఈ పుస్తకంలో SELECTED కార్టూనులు మాత్రం వేశారంటే నే నొప్పుకోను. ఐతే ఈ పుస్తకంలో బాపూ ఆలోచించిన అన్ని అంశాలనూ (దాదాపు) సంకలనం చేశారు-అని మాత్రం చెప్పవచ్చు.

పుస్తకంలో ప్రచురింపబడిన దాదాపు అన్ని కార్టూనులూ 3, 4 నంబర్ల కుంచెలతో వేసినవి. కుంచెతో సన్నటి గీతలు గీయడానికి QUICK REFLEXES అవసరం. బాపూ యిందులో కడు నేర్పరి. బాపూ బొమ్మల్లో చక్కటి PROPORTIONALITY కనిపిస్తుంది.

